

గుణాత్మక విద్య అందేనా?

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరైన విద్య అందడంలేదు. గత ప్రభుత్వ విధానాలే కారణమని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

- 8లో ▸



అథ్లెటిక్స్ ప్రారంభం

తెలంగాణ యూనివర్సిటీలోని క్రీడా మైదానంలో ఇంటర్ కళాశాల అథ్లెటిక్స్ గురువారం ప్రారంభమయ్యాయి.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
27.9/14.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. శీతలగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

సరిపడా ఎరువుల నిల్వలు

- బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలో ప్రస్తుతం సరిపడా ఎరువులు ఉన్నాయని బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఇకమీదట సైతం ఎరువుల కొరత రాకుండా అధికారులు ఎప్పటికప్పుడు అవసరమైన మేర స్టాక్ ఉండేలా చూసుకోవాలని ఆయన గురువారం అధికారులకు సూచించారు. సహకార సంఘాల వద్ద రైతులకు సరిపడా నిల్వలు ఉండేలా జిల్లా అధికారులు ఆయా సొసైటీల సీఈవోలకు కచ్చితమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఎరువుల నిల్వల నిర్వహణ, సరఫరాలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా సహించేది లేదన్నారు. జిల్లాలో ఎక్కడ కొరత ఏర్పడినా, దానికి సహకార సంఘాల సీఈవోలు, జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా రైతులు తమకు అవసరమైనంత మేరకే ఎరువులను తమవద్ద నిల్వ చేసుకోవాలన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

డొంకేశ్వర్(ఆర్మూర్): రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని డీసీవో సింహాచలం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. యాసంగికి అవసరమైన నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్‌కు ముందుగానే డబ్బులు చెల్లించి సహకార సంఘాల్లో ఎరువుల నిల్వలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సొసైటీల కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చామని పేర్కొన్నారు. కొరత ఉందని తెలిస్తే ఆ సంఘ కార్యదర్శిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

కేంద్ర హోంమంత్రిని కలిసిన ఎంపీ అర్వింద్



సుభాష్‌నగర్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను ఎంపీ ధర్మపురి అర్వింద్ గురువారం న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలను అమిత్ షా అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో దాదాపు సమానంగా బీజేపీకి ఓట్లు వచ్చాయని ఎంపీ వివరించారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి పలు విషయాలపై కూడా చర్చించారు.

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాల్వల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండడంతో నీటిమట్టం తగ్గుతోంది. కాకతీయ కాలువ ద్వారా 3,500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 50 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 50 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 337 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 405 క్యూసెక్కుల నీరు పోతుంది. దీంతో మూడు రోజుల వ్యవధిలో ఒక్క టీఎంసీ నీరు తగ్గింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,091అడుగులు(90 టీఎంసీలు) కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1,088.10అడుగుల (87టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

10.2 డిగ్రీలు

జిల్లా ప్రజలను చలి గజగజ వణికిస్తోంది. గడిచిన మూడు రోజుల నుంచి కనిష్ట ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోతున్నాయి. బోధన్ మండలంలోని చిన్నమావందిలో అత్యల్పంగా 10.2 డిగ్రీలు నమోదైంది. రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. సంక్రాంతి వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు ఇలాగే నమోదు కానున్నాయి. జిల్లావ్యాప్తంగా సగటు కనిష్ట ఉష్ణోగ్రత 14.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. చలి తీవ్రతకు వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.



- చలికి వణికిపోతున్న ప్రజలు
- పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- చిన్నమావందిలో అత్యల్పంగా 10.2 డిగ్రీలు నమోదు
- రానున్న రోజుల్లో మరింత పెరగనున్న చలి

జిల్లాలో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు..

గ్రామం	ఉష్ణోగ్రత	జానకంపేట	11.8	ఏర్గట్ల	13.0	భీమ్‌గల్	13.4
చిన్నమావంది	10.2	రుద్రూరు	11.8	సీహెచ్ కొండూరు	13.1	కొరట్‌పల్లి	13.6
మోస్రా	10.9	డిచ్‌పల్లి	11.8	బాల్కొండ	13.1	మచ్చర్ల	13.6
పోతంగల్	11.0	మెండోరా	11.9	పెర్కిట్	12.6	సిరికొండ	13.6
నిజామాబాద్	11.1	తూంపల్లి	12.0	మగ్గిడి	12.7	వేంపల్లి	13.7
సాలూర	11.2	చీమన్‌పల్లి	12.0	రెంజల్	12.7	లక్ష్మాపూర్	13.8
మంచిప్ప	11.2	చందూరు	12.0	బెల్లాల్	12.8	కమ్మర్‌పల్లి	13.8
కోటగిరి	11.2	ఎడపల్లి	12.3	కోనసముందర్	12.9	తొండకూర్	14.0
కల్దుర్కి	11.3	నవీపేట	12.4	ఇసాపల్లి	13.1	ధర్పల్లి	14.2
నిజామాబాద్ నార్త్	11.5	మదన్‌పల్లి	12.6	మల్కాపూర్	13.1	ఆలూరు	14.7
గూపన్‌పల్లి	11.5	వేల్పూర్	12.9	మోర్తాడ్	13.0	ముప్కాల్	14.8
పాల్దా	11.7	జక్రాన్‌పల్లి	12.9	గన్నారం	13.2	జాకోరా	15.6

సుభాష్‌నగర్ : అక్టోబర్ 1 నుంచి శీతాకాలం సీజన్ ప్రారంభమైంది. మూడు రోజులుగా జిల్లావ్యాప్తంగా సగటు కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. 16.5 డిగ్రీల నుంచి ఒక్కసారిగా 14 డిగ్రీలకు పడిపోయింది. దీనికితోడు చలిగాలులు వీస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా చలి పంజా విసురుతోంది. గరిష్ట ఉష్ణోగ్రతల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకుంటున్నప్పటికీ.. కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశముంది. చలి తీవ్రతకు ఉదయం వాకింగ్, వ్యాయామం చేసే వారు బయటికి రావాలంటే జంకుతున్నారు. కొందరు ఉన్ని దుస్తులు, టోపీలు, ఇతర జాగ్రత్తలు తీసుకుంటూ వెళ్తున్నారు. ఉదయం 9 గంటలైనా బయటికి రాలేకపోతున్నారు. ముఖ్యంగా రాత్రయితే చలి ప్రభావంతో గ్రామాలు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

మరింత పెరిగే అవకాశం!

జిల్లాలో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. మరో రెండు, మూడు రోజులూ కనిష్ట ఉష్ణోగ్రతలు ఇలాగే ఉండనున్నాయి. జనవరి 15వ తేదీవరకూ జిల్లాలో చలి ప్రభావం చూపనుంది. రానున్న రోజుల్లో సగటు కనిష్ట ఉష్ణోగ్రతలు 10 నుంచి 11 డిగ్రీలకు పడిపోయే అవకాశముంది. గతేడాది జిల్లాలో 13 డిగ్రీల సగటు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వయస్సుతో సంబంధం లేకుండా గుండె జబ్బులు, పక్షవాతం బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఆస్తమా వ్యాధిగ్రస్తులు, ఫిట్స్ వచ్చే వారు కూడా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

దంపతుల మృతదేహాల గుర్తింపు

- నిందితులను తీసుకెళ్లి వెలికితీసిన పోలీసులు
- పంచనామా చేసి అక్కడే పూడ్చేశారు
- ఆరుగురి హత్య కేసులో పూర్తయిన మృతదేహాల గుర్తింపు



రమణి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, రమణి(ఫైల్) ఇన్‌సెట్‌లో..



ప్రసాద్ మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం, ప్రసాద్(ఫైల్) ఇన్‌సెట్‌లో..

మాక్లూర్/నవీపేట/ఖలీల్‌వాడి: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆరుగురి హత్య కేసులో నలుగురు మృతదేహాలు ఇప్పటికే లభించగా.. భార్యభర్తల మృతదేహాలను గురువారం పోలీసులు గుర్తించారు. ప్రసాద్ మృతదేహాన్ని మాక్లూర్ మండలం మదన్‌పల్లి శివారులో వెలికితీశారు. గురువారం తెల్లవారు జామున నిందితులను తీసుకువచ్చి ప్రసాద్‌ను చంపి పూడ్చిన స్థలాన్ని గుర్తించారు. స్థానిక తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్, నార్త్ జోన్ సీఐ సతీశ్, స్థానిక ఎస్సై సుధీర్‌రావు, నవీపేట ఎస్సై యాదగిరి సమక్షంలో పంచనామా నిర్వహించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోగా.. తల భాగం పగిలి ఉండడంతో తలనే టార్గెట్ చేసి కొట్టి చంపినట్లుగా కనిపించింది. పంచనామా అనంతరం మృతదేహాన్ని అక్కడే పూడ్చిపెట్టారు. ఈ సందర్భంగా మృతుడి తల్లి సుశీల ఇతర కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అలాగే ప్రసాద్ భార్య రమణి మృతదేహాన్ని యంచ శివారులోని గోదావరి ఒడ్డున రైల్వే బ్రిడ్జి సమీపంలో గుర్తించారు. ప్రసాద్ తల్లి సుశీల, అత్త కళావతిలను వెంట తీసుకుని వచ్చిన పోలీసులు మృతదేహాన్ని రమణిగా నిర్ధారించారు. డిప్యూటీ తహసీల్దార్ హాజీ, వైద్యాధికారి సుధ ఆధ్వర్యంలో అక్కడే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం దహన సంస్కారాలు చేశారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ఏసీపీ శ్రీనివాస్‌రావు, సదాశివనగర్ సీఐ రామన్, నిజామాబాద్ నార్త్ జోన్ సీఐ సతీశ్, ఎస్సై యాదగిరిగౌడ్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ కేసుకు సంబంధిచి నిందితుడు ప్రశాంత్ హతమార్చిన ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి.



రోదిస్తున్న ప్రసాద్ తల్లి


కస్టడీలోకి తీసుకున్న సదాశివనగర్ పోలీసులు

ప్రసాద్ కుటుంబం హత్య కేసులో నిందితులను సదాశివనగర్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ప్రసాద్ కుటుంబాన్ని అంతమొందించడానికి కారణాలపై పోలీసులు విచారించనున్నారు. ఇంటి కోసమే చేశారా లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అని పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

రాయితో మోది, గొంతు నులిమి హత్యలు

ఆరుగురి హత్య కేసులో నిందితులు హతులను రాయితో మోది, గొంతు నులిమి హత్య చేశారు. గత నెల 29న ప్రసాద్‌ను డబ్బుల విషయమై మాట్లాడుకుందామని ప్రశాంత్ మదన్‌పల్లి అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లారు. అక్కడ మద్యం సేవించిన తర్వాత రాయితో మోది హత్య చేశారు. అక్కడే గొయ్యి తవ్వి ప్రసాద్ మృతదేహాన్ని పూడ్చి వేశాడు. అనంతరం డిసెంబర్ 1న ప్రశాంత్ మాచారెడ్డి మండలం పాల్వంచకు వెళ్లి ప్రసాద్‌ను ఓ కేసులో అరెస్ట్ చేయడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారని ప్రసాద్ భార్య రమణిని, అతని చెల్లెళ్లను కారులో ఎక్కించుకొని నిజామాబాద్ నగరానికి తీసుకువచ్చాడు. ప్రసాద్ బాసర దగ్గర ఉన్నాడని చెప్పి రమణిని తీసుకెళ్లి గొంతు నులిపి చంపి గోదావరి నదిలో పడేశాడు. అనంతరం ప్రసాద్ చెల్లెలు స్రవంతిని నిందితులు చేగుంట మండలం వడియారం వద్దకు తీసుకెళ్లి గొంతు పిసికి చంపేసి పెట్రోల్ పోసి కాల్చివేశారు. పోలీసులు మాక్లూర్‌తో పాటు మాచారెడ్డి మండలం పాల్వంచలో నిఘా పెట్టారని ప్రసాద్ తల్లి సుశీల, ఇద్దరు కవల పిల్లలు చైత్రిక, చైత్రిక్‌తో పాటు మరో చెల్లెలు స్వప్నను నిందితులు నిజామాబాద్‌లోని రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలోని ఓ లాడ్జిలో ఉంచారు. ప్రసాద్ పిల్లలను చూడాలంటున్నాడని చెప్పి ఇద్దరు కవల పిల్లలను కారులో నిర్మల్ వైపు తీసుకెళ్లారు. మార్గమధ్యలో కారులోనే పిల్లల గొంతు నులిమి చంపేసి మెండోరా మండలం దూదిగాం వద్ద గోదావరి నదిలో పడేసి వెళ్లారు. తర్వాత స్వప్నను ఈనెల 13న సదాశివనగర్ మండలం భూంపల్లి వద్ద గొంతు నులిమి చంపి పెట్రోల్ పోసి తగులబెట్టారు.

అర్జునధారికి ప్రశంసల వెల్లువ



ఇందూరు బాక్సింగ్ క్రీడాకారుడు హుస్సాముద్దీన్‌కు ప్రతిష్ఠాత్మకమైన అర్జున అవార్డు దక్కడంపై ప్రశంసల వర్షం కురుస్తోంది. క్రీడాకారులు, క్రీడాభిమానుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. హుస్సాముద్దీన్ తనదైన ఆట తీరుతో ఎన్నో పతకాలను సొంతం చేసుకున్నాడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న ఆయనకు కేంద్ర ప్రభుత్వం అర్జున అవార్డు ప్రకటించింది.

-వివరాలు 8లో..

సీఎంసీని పరిశీలించిన కలెక్టర్

- పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): రాబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం డిచ్‌పల్లిలోని సీఎంసీ మెడికల్ కళాశాలను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూం వంటి వాటికి ఈ కళాశాలలో అనువుగా ఉన్న గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. మొత్తం ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో జరిగే పోలింగ్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపు నిర్వహించాల్సి ఉన్నందున అందుకనుగుణంగా కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూంలు, రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, అదనపు డీసీపీ జయరాంలతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. సీఎంసీ భవనానికి సంబంధించిన బ్లూ ప్రింట్‌ను పరిశీలించి ప్రస్తుతం కౌంటింగ్ నిర్వహణకు ఏ మేరకు అనువైన పరిస్థితులు ఉన్నాయని పరిశీలించారు.



సీఎంసీ భవనంలోని గదులను పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

ఈ భవనం వినియోగంలో లేని కారణంగా అక్కడక్కడా నిర్వహణాపరమైన లోపాలు ఉండడాన్ని గమనించిన కలెక్టర్ అవసరమైన చోట మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా భవనం అన్నివిధాలా అనుకూలంగా ఉంటుందా, లేదా అని మరింత సమగ్రంగా పరిశీలన జరపాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్, జిల్లా కార్మిక శాఖ అధికారి యోహాన్ తదితరులున్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి

- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో పంచాయతీరాజ్, అర్‌అండ్‌బీ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పక్కాగా పాటించాలని జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా 2020–21 నుంచి 2023–24 వరకు మంజూరైన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రోడ్లు, భవనాల శాఖ రోడ్లపై అక్కడక్కడా గుంతలు పడడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో మంజూరైన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

మాక్లూర్ మండలంలో మంజూరైన ముల్లంగి-బొంకన్‌పల్లి లిఫ్ట్ పనులు అగ్రిమెంట్ ప్రకారం పూర్తి చేయించాలన్నారు. రాష్ట్రంలో కోవిడ్ కేసులు నమోదు దృష్ట్యా వసతి గృహాల్లో జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కమిటీ చైర్‌పర్సన్ దాసరి ఇందిరా లక్ష్మీనర్సయ్య, జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రాణాకలాన్ గోదాం పరిశీలన

జీపీకి తాళాల అప్పగింత

సాక్షి ఎఫెక్ట్..

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలం రాణాకలాన్‌లోని రూర్బన్ నిధులతో చేపట్టిన 500 మెట్రిక్ టన్నుల గోదాంను డీఆర్‌డీవో డీపీఎం సంజీవ్‌కుమార్ గురువారం పరిశీలించారు. 'సాక్షి' దినపత్రికలో గురువారం ప్రచురితమైన 'మాజీ ప్రజాప్రతినిధి కక్కుర్తి' వార్తకు జిల్లా అధికారులు స్పందించి గోదాంను పరిశీలించారు. అనంతరం డీపీఎం ఓంకార్ గోదాం తాళాలను పంచాయతీ అధికారులకు అందించారు. గోదాంకు వచ్చిన ఆదాయాన్ని ప్రత్యేకంగా రశీదులు ఏర్పాటు చేసి వాటి కిరాయి వివరాలను అందులో పొందుపర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపాలకృష్ణ, ఏపీవో ఓంపాల్, ఏపీఎం శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



గోదాంను పరిశీలిస్తున్న డీపీఎం సంజీవ్‌కుమార్

రెండున్నరేళ్ల అద్దెపై స్పష్టత కరువు

మాజీ ప్రజాప్రతినిధి గోదాంను రెండున్నరేళ్లు వినియోగించుకోగా.. కిరాయి వసూలుపై స్పష్టత రాలేదు. దీంతో అద్దె వసూలు చేస్తారా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యులకు నోటీసులిచ్చి వసూలు చేసే అధికారులు మాజీ ప్రజాప్రతినిధిపై ఉదాసీనతంగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అధికారులు స్పందించి కిరాయి వసూలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తి ప్రపత్తులతో ధనుర్మాస ఉత్సవాలు

- సుభాష్‌నగర్ రామాలయంలో వైభవంగా ఉత్సవాలు
- 37 ఏళ్లుగా శాస్త్రోక్తంగా పూజా క్రతువులు
- ముక్కోటి నేపథ్యంలో రేపు ఆలయంలో ఉత్తరద్వార దర్శనం



నగరంలోని సుభాష్‌నగర్ శ్రీరామాలయం



ఆలయ ప్రాంగణంలోని బృందావన తులసీవనం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సుభాష్‌నగర్ శ్రీరామాలయంలో 17వ తేదీ నుంచి ధనుర్మాస ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజు సాయంత్రం తిరుప్పావై ప్రవచనాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాలు వచ్చే నెల 14వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా జనవరి 14న 'శ్రీ గోదా రంగనాయక కల్యాణం' నిర్వహించనున్నారు. ఈ కల్యాణంతో పాటు తిరుప్పావై గ్రంథ పూజ, కాలక్షేప పరిసమాప్తి, ఆచార్య సన్మానం చేయనున్నారు. 15వ తేదీన మకర సంక్రాంతి కార్యక్రమాలు చేయనున్నారు. ప్రతియేటా ధనుర్మాస ఉత్సవాలకు ముందు కార్తీక మాసంలో ప్రత్యేకంగా నెల రోజుల పాటు బృందావన పూజలు (తులసి పూజలు) చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఆలయ ప్రాంగణంలో బృందావనం పేరిట తులసి వనాన్ని పెంచుతున్నారు. ఈ బృందావనం భక్తుల ప్రదక్షిణకు అనువుగా ఉంది.

1986లో ఆలయం..

బి.ఆర్.గంగారెడ్డి ఫౌండర్ అధ్యక్షుడిగా 1986 ఏప్రిల్ 14న శ్రీ త్రిదండి రామానుజ చిన్నజీయరు స్వామి వారి మంగళశాసనములతో ఈ ఆలయం ప్రారంభించారు. ఇందులో శ్రీ సీతారామ లక్ష్మణ స్వాములతో పాటు ఆంజనేయుడు, గరుత్మంతుడు, లక్ష్మీదేవి, గోదాదేవి మూలవిరాట్టులుగా ఉన్నారు. అప్పటి నుంచి ప్రతి క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించే విషయంలో ఏమాత్రం లోటు లేకుండా నిర్వహిస్తున్నారు. మహిళా భక్తుల నాయకత్వంలో ప్రతి యేటా క్రతువులు కచ్చితమైన పద్ధతిలో చేస్తున్నారు. ఈ విడతలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్‌గా సరళ మహేందర్‌రెడ్డి, కార్యదర్శిగా శోభ నవీన్ రెడ్డి వ్యవహరిస్తున్నారు.

ప్రతినెలా శ్రీరాముడి పునర్వసు కల్యాణం..



ఆలయ నిర్వహణ కచ్చితమైన శాస్త్రోక్తంగా నిర్వహిస్తూ వస్తున్నాం. ప్రతినెలా శ్రీరాముడి పునర్వసు కల్యాణం నిర్వహిస్తున్నాం. శ్రీరామనవమికి 10 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. వైకుంఠ ఏకాదశికి ముక్కోటి ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. ఈ నెల 23న ఆలయంలో ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశాం. ముక్కోటి నేపథ్యంలో లక్ష పుష్పార్చన, 31న నాయిగనాయి ఉత్సవం, వచ్చే నెల 2న శ్రీలక్ష్మీదేవి వైభవ విశేషము, 7న సింహాసనం పాట్టు, 8న దీపోత్సవం, 11న కూడారై ఉత్సవం, 12న అన్నకూటోత్సవం(కదంబం), 13న ఉలుక పూజ కార్యక్రమాలు ఉన్నాయి.

–సరళ మహేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్‌పర్సన్

సమష్టి కృషితో నిర్వహణ



ఆలయంలో అన్ని సేవలను, క్రతువులను సమష్టిగా నిర్వహిస్తూ వస్తున్నాం. అన్నింటికి ఒక క్రమపద్ధతి పాటిస్తున్నాం. కార్యవర్గ సభ్యులందరూ సమష్టి బాధ్యతతో వ్యవహరిస్తున్నారు. ఇక ఆలయంలో పొంగలి, దద్దోజనం, పులిహోర, సిరా, కుడారై భోగం, కదంబం, ధనుర్మాస రోజువారి పుష్ప కైంకర్యం, ధనుర్మాస ప్రసాదం కోసం దొప్పలు, దీపోత్సవం, ఆహ్వాన పత్రికలు, వస్త్రములు, లక్ష పుష్పార్చన, గోదా కల్యాణం రోజు అన్నదానం తదితరాలకు 42 మంది దాతల కుటుంబాలు నిరంతరం సహకరిస్తున్నాయి. ధనుర్మాస ఉత్సవాలకు ప్రత్యేక కమిటీ ప్రతియేటా ఏర్పాటు చేసుకుంటూ వస్తున్నాం.

–శోభ నవీన్‌రెడ్డి, ఆలయకమిటీ ప్రధాన కార్యదర్శి

కరోనా కొత్త వేరియంట్‌పై నేడు 'సాక్షి' ఫోన్‌ఇన్



దేశంలో కరోనా జేఎన్1 వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందుతోంది.. కొత్త వేరియంట్ ఎలా వ్యాప్తి చెందుతుంది... కరోనా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు. కరోనా వస్తే ఎలాంటి మందులతో పాటు సలహాలు తీసుకోవాలి.. తదితర వాటిపై 'సాక్షి' ప్రముఖ జనరల్ ఫిజీషియన్ (ఎండీ) డాక్టర్ జలగం తిరుపతిరావుతో ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ప్రజలు ఈ కింది నంబర్లకు ఫోన్‌చేసి సలహాలు, సూచనలు పొందవచ్చు.



డాక్టర్ జలగం తిరుపతిరావు
ప్రముఖ జనరల్ ఫిజీషియన్(ఎండీ)

తేది : 22-12-2023 (శుక్రవారం)
సమయం: ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు..

ఫోన్ చేయాల్సిన నంబర్లు:
89780 36828
77990 77910

క్లుప్తంగా

పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

నిజామాబాద్‌అర్బన్‌: పదో తరగతి పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి సూచించారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి జిల్లా విద్యాధికారులతో గురువారం సమీక్షించారు. ఎంతమంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు, పలు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలన్నారు. ఇందుకు సంబంధించి ఎంఈవోలు, హెచ్‌ఎంలు అప్రమత్తంగా ఉండి ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హన్మంత్‌,డీఈవో దుర్గాప్రసాద్‌ ఉన్నారు.

కల్లెడ ఘటనపై విచారణకు ఆదేశం

మాక్లూర్‌ మండలం కల్లెడ ప్రభుత్వ పాఠశాలలో చోటు చేసుకున్న గంజాయి ఘటనపై విచారణ చేపట్టాలని ఎంఈవోను డీఈవో దుర్గాప్రసాద్‌ ఆదేశించారు. సామగ్ర నివేదిక అందించాలన్నారు.

23న క్రిమినల్ చట్టాలపై సెమినార్‌



ఖలీల్‌వాడి: రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌, నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సివిల్‌, క్రిమినల్‌ చట్టాలపై శనివారం సెమినార్‌ నిర్వహించనున్నట్లు బార్‌ కౌన్సిల్‌ సభ్యుడు మంథని రాజేందర్‌రెడ్డి, బార్‌ అధ్యక్షుడు దేవదాసు గురువారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవ సదన్‌లో నిర్వహిస్తున్న సెమినార్‌కు ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా న్యాయవాదులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సెమినార్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల పాల్గొంటారని అన్నారు. సమావేశంలో బార్‌ ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, ప్రధాన కార్యదర్శి భాగిచరణ్‌, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో సృజన టెక్‌ ఫెస్ట్‌ పోటీలు



నిజామాబాద్‌ అర్బన్‌: ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌ కళాశాలలో సృజన టెక్‌ ఫెస్ట్‌ను గురువారం నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ మహిళా, బాలుర, నందిపేట పాలిటెక్నిక్‌ కళాశాల విద్యార్థులు తమ ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఉత్తమ ప్రదర్శన నిర్వహించిన జట్లకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బీఎస్‌ఎన్‌ఎల్‌ మంచిర్యాల ఎస్‌డీ ఈ సదానందం, కాకతీయ మహిళా కళాశాల హెచ్‌వోడీ మహిపాల్‌, మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌ నరేశ్‌, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

అబ్జర్వర్‌గా గంగామోహన్‌



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్‌ సాఫ్ట్‌బాల్‌ చాంపియన్‌షిప్‌ పోటీలకు అబ్జర్వర్‌గా మిట్టాపల్లి పీఈటీ మర్కంటి గంగామోహన్‌ ఎంపికయ్యారు. ఈనెల 21 నుంచి 23 వరకు నిర్మల్‌లో నిర్వహిస్తున్న అండర్‌-17 సాఫ్ట్‌బాల్‌ రాష్ట్ర పోటీలకు గంగామోహన్‌ ఎంపికయ్యారు. అనంతరం జిల్లా ఎస్‌జీఎఫ్‌ కార్యదర్శి సంగీత రావు, జిల్లా సాఫ్ట్‌ బాల్‌ అసోసియేషన్‌ సంయుక్త కార్యదర్శి నవీన్‌, పలువురు గంగామోహన్‌ను అభినందించారు.

అర్జునధారికి ప్రశంసల వెల్లువ

- హుస్సాముద్దీన్‌కు అర్జున అవార్డు
- ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే తన లక్ష్యమంటున్న బాక్సర్‌





బాల్యంలో తన తండ్రి శంశొద్దీన్‌ వద్ద శిక్షణ తీసుకుంటున్న హుస్సాముద్దీన్‌

నిజామాబాద్‌నాగారం: భారత ప్రభుత్వం క్రీడాకారుల సేవలకు గుర్తింపుగా అందించే అర్జున అవార్డు ఇందూరు బాక్సింగ్‌ క్రీడాకారుడు హుస్సాముద్దీన్‌కు వరించింది. బాక్సింగ్‌ కోచ్‌ అయిన తన తండ్రి శంశొద్దీన్‌ వద్దే ఓనమాలు నేర్చుకుంటు క్రీడలో తనదైన శైలిలో ముద్రవేసుకుంటున్నాడు. ఎంతో ప్రతిష్టాత్మకమైన అర్జున అవార్డును సాధించి అందరి చూపును జిల్లావైపు మలిచాడు. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులు, అభిమానులు ఆయనకు ప్రశంసల వర్షం కురిపించారు.

నగరంలోని పాటిగల్లీలో ఉండే ఎండీ శంశొద్దీన్‌ ఐదో సంతానం మహ్మద్‌ హుస్సాముద్దీన్‌. తండ్రి బాక్సింగ్‌ కోచ్‌ కావడంతో ప్రతి రోజు శిక్షణ తీసుకుంటు ఓనమాలు నేర్చాడు. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటు బాక్సింగ్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించే స్థాయికి ఎదిగాడు. డిగ్రీ పూర్తి చేసి ఆర్మీకి ఎంపికైనా బాక్సింగ్‌లో తన సత్తా చాటుతూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. ఒలింపిక్‌లో ఎలాగైనా పతకం సాధించాలన్న పట్టుదలతో పంజాబ్‌లోని పటియాలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నాడు హుస్సాముద్దీన్‌.

గతేడాది నిఖత్‌జరీన్‌కు..

జిల్లా నుంచి ఇప్పటి వరకు బాక్సింగ్‌ క్రీడలో గతేడాది జిల్లా క్రీడాకారిణి అయిన నిఖత్‌జరీన్‌కు అర్జున అవార్డు వచ్చింది. ఈ ఏడాది సైతం జిల్లాకు చెందిన హుస్సాముద్దీన్‌కు అర్జున అవార్డు దక్కడంపై జిల్లా క్రీడాకారులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో..

హుస్సాముద్దీన్‌ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రత్యర్థులను తన బలమైన షాట్‌లతో ఓడిస్తూ అనేక పతకాలు సాధించాడు. 2015 కొరియాలో నిర్వహించిన వరల్డ్‌ బాక్సింగ్‌లో కాంస్య పతకం, 2017 బల్గేరియాలో రజతం, మంగోలియాలో కాంస్య పతకం, 2018 ఢిల్లీలో ఓపెన్‌ బాక్సింగ్‌ చాంపియన్‌షిప్‌లో, బల్గేరియా, ఆస్ట్రేలియాలో నిర్వహించిన పోటీల్లో వరుసగా కాంస్య పతకాలు, జర్మనీలో బంగారు పతకం సాధించి విజయం పొందాడు. 2019లో ఫిన్‌లాండ్‌, పోలాండ్‌, థాయ్‌లాండ్‌లో రజత పతకాలు, 2020 బల్గేరియాలో కాంస్యం, చైనాలో బంగారు, జర్మనీలో కాంస్యం, 2021 స్పెయిన్‌లో రజతం, 2022 బర్మింగ్‌హోమ్‌ కామన్‌వెల్త్‌ క్రీడల్లో కాంస్యం, జోర్డాన్‌లో కాంస్యం, 2023 తాష్కెంట్‌ దేశంలో నిర్వహించిన వరల్డ్‌ బాక్సింగ్‌ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించాడు.

35 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్నా

నేను 35 ఏళ్లుగా బాక్సింగ్‌లో శిక్షణ ఇస్తున్నా. ఇప్పటి వరకు 160కి పైగా క్రీడాకారులు నా వద్ద శిక్షణ తీసుకున్నారు. ఇందులో 100కుపైగా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించారు. ఆరుగురు అంతర్జాతీయస్థాయికి ఎదిగారు. ఇందులో ముగ్గురు నా కుమారులు ఉన్నారు. ఒక్కరు రైల్వేలో, మరొకరు ఆర్మీలో ఉద్యోగం చేస్తుండగా హుస్సాముద్దీన్‌ ఆర్మీలో ఉండి దేశానికి పతకాలు తీసుకు రావడానికి శ్రమిస్తున్నాడు. ప్రతి ఏడాది 30కిపైగా క్రీడాకారులు నావద్ద శిక్షణ తీసుకుంటున్నారు.

– శంశొద్దీన్‌, బాక్సింగ్‌ కోచ్‌

అవార్డుతో జిల్లాకు కీర్తి



హుస్సాముద్దీన్‌కు అర్జున అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. గతేడాది నిఖత్‌జరీన్‌కు వచ్చింది. బాక్సింగ్‌లో కఠోరంగా సాధన చేస్తేనే ఇలాంటి అవార్డులు, పతకాలు అందుతాయి. అర్జున అవార్డుతో జిల్లా కీర్తి మరింత పెరిగింది. ఇదే స్ఫూర్తితో కొత్త క్రీడాకారులు తయారవుతారు.

– శివసాయి, జాతీయస్థాయి క్రీడాకారిణి

స్ఫూర్తిగా నిలిచాడు..



జిల్లాకు కీర్తి తెచ్చిన హుస్సాముద్దీన్‌ మాలాంటి బాక్సింగ్‌ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచాడు. అంతర్జాతీయస్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులను చూసే బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నా. కచ్చితంగా నేను ఈ స్థాయికి చేరుకునేలా నిరంతం శ్రమిస్తా.

– సొహెల్‌, జిల్లా క్రీడాకారుడు

నేటి తరానికి ఆదర్శం



నేటితరం క్రీడాకారులకు హుస్సాముద్దీన్‌ ఆదర్శంగా నిలిచాడు. చిన్నప్పటి నుంచి బాక్సింగ్‌ క్రీడనే జీవితంగా ముందుకు కదిలాడు. అందుకు తగిన ప్రతిఫలం ప్రభుత్వం గుర్తించడం సంతోషంగా ఉంది. హుస్సాముద్దీన్‌కు జిల్లా క్రీడాకారుల తరఫున తామంతా సలామ్‌ చేస్తున్నాం.

– సయ్యద్‌కుల్‌సామ్‌, రాష్ట్ర స్థాయి క్రీడాకారుడు

దేశానికి మంచి పేరు తేవాలి



జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన హుస్సాముద్దీన్‌కు ప్రత్యేకంగా అభినందనలు. అర్జున అవార్డు సాధించి మాకు స్ఫూర్తిగా నిలిచాడు. మేము కూడా నిరంతరం సాధన చేసి ఉన్నతంగా ఎదుగుతాం. ఒలింపిక్స్‌లో సైతం విజయం సాధించి దేశానికి పేరు తేవాలి.

– కుతుబుద్దీన్‌, రాష్ట్ర స్థాయి క్రీడాకారిణి

జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



కంబ హిమతేజ



పల్లపు సాయి చరణ్‌

పెర్కిట్‌(ఆర్మూర్‌): జాతీయ స్థాయి వాలీబాల్‌ పోటీలకు ఆర్మూర్‌ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కంబ హిమతేజ, పల్లపు సాయి చరణ్‌ ఎంపికైనట్లు హెచ్‌ఎం హరిత గురువారం తెలిపారు. మహబూబ్‌నగర్‌ జిల్లాలో ఇటీవల నిర్వహించిన అండర్‌-14 రాష్ట్ర స్థాయి వాలీబాల్‌ పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఒరిస్సా రాష్ట్రంలో ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. అనంతరం విద్యార్థులను హెచ్‌ఎం అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పోచంపాడ్‌ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బాల్కొండ: రాష్ట్ర స్థాయి బీచ్‌ వాలీబాల్‌ పోటీలకు మెండోరా మండలం పోచంపాడ్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఆకాశ్‌, విఘ్నరాజు, అల్మస్‌, మోహిత్‌ ఎంపికయ్యారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరిని అభినందించారు. ఈ నెల 24 నుంచి 26 వరకు వరంగల్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం మనోహర్‌ తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ భూపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అద్దె బస్సుల చార్జీలు పెంచాలి



ఖలీల్‌వాడి: మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు వస్తుండటంతో అద్దె బస్సులకు చెల్లించే చార్జీలను పెంచాలని హైర్‌ బస్‌ అసోసియేషన్‌ స్టేట్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ వెంకటేశ్వర్‌, జిల్లా కార్యదర్శి అశోక్‌కుమార్‌ కోరారు. ఈ మేరకు గురువారం ఆర్‌ఎం జానీరెడ్డికి వినతిపత్రం అందజేశారు. మహాలక్ష్మి పథకం అమలు కాకముందు అద్దె బస్సుల్లో సరాసరి 50 మంది ప్రయాణించే వారని ఇప్పుడు 100 మందికి పైగా ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. కెపాసిటీ పెరగడంతో బస్సులు గమ్యానికి చేరడంలో ఆలస్యం అవుతుందని చెప్పారు. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో బస్సులకు మెయింటెన్స్‌ ఛార్జీలు ఎక్కువ అవుతున్నాయని, దానికి తగినట్లుగా తమకు చెల్లించే చార్జీలను పెంచాలని కోరారు. అసోసియేషన్‌ సభ్యులు రామకృష్ణ, గణేష్‌, భీమయ్య, శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

వర్సిటీ ఇంటర్‌ కళాశాల అథ్లెటిక్స్‌ ప్రారంభం



అథ్లెటిక్స్‌ పోటీలను ప్రారంభిస్తున్న తెయూ క్రీడావిభాగం డైరెక్టర్‌ బాలకిషన్‌

తెయూ(డిచ్‌పల్లి): తెయూలోని వర్సిటీ క్రీడా మైదానంలో ఇంటర్‌ కళాశాల అథ్లెటిక్స్‌ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. తెయూ క్రీడా విభాగం డైరెక్టర్‌ బాలకిషన్‌ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి సౌత్‌ ఇంటర్‌ యూనివర్సిటీ అథ్లెటిక్స్‌ పోటీలకు తెయూ తరపున పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 29 నుంచి జనవరి 1 వరకు తమిళనాడులో నిర్వహించే సౌత్‌జోన్‌ ఇంటర్‌ వర్సిటీ అట్లాంటిక్‌ (మెన్‌) టోర్నమెంట్‌లో తెయూ జట్టు సభ్యులు పాల్గొంటారని డైరెక్టర్‌ బాలకిషన్‌ తెలిపారు. పోటీల్లో 9 కళాశాలల నుంచి సుమారు వంద మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు ఫిజికల్‌ డైరెక్టర్‌ బీఆర్‌నేత పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ఫిజికల్‌ డైరెక్టర్లు అనిల్‌ కుమార్‌, రాంకిషన్‌, సౌమ్య, జూనియర్‌ అసిస్టెంట్‌ నరేశ్‌ జాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందేనా?



కమ్మర్‌పల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

- విభిన్న కార్యక్రమాలతో తరగతులకు ఉపాధ్యాయులు దూరం
- ఒత్తిడిలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు

కమ్మర్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన కంటే బోధనేతర పనులకే ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు అధిక సమయం కేటాయించాల్సి వస్తోంది. గత ప్రభుత్వ నిర్వాకం వల్లే తాము విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పరిగడుపున ఆకలి తీర్చేందుకు గత ప్రభుత్వం అల్పాహారం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంతో పాటు, డైరెక్టర్‌ ఆఫ్‌ స్కూల్‌ ఎడ్యుకేషన్‌(డీఎస్‌ఈ), ఫేస్‌ రికగ్నిజేషన్‌ సిస్టం(ఎఫ్‌ఆర్‌సీ) యాప్‌ ద్వారా విద్యార్థుల హాజరు, రాగి జావా పంపిణీ వంటి కార్యక్రమాల వివరాలను ప్రతి రోజు నమోదు చేయాల్సి ఉటుంది. అలాగే ప్రాథమిక పాఠశాలల్లో 'తొలిమెట్టు', ఉన్నత పాఠశాలల్లో 'ఉన్నతి' వంటి కార్యక్రమాలు ప్రారంభించిన నేపథ్యంలో ఉపాధ్యాయులకు వారంతపు పీరియడ్‌ ప్రణాళికల తయారీ, బోధనోపకరణాలను సిద్ధం చేసుకోవడం, వర్క్‌ షీట్‌లను చేయించడం వంటి పనులకే పరిమితమై బోధనకు దూరమవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా జిల్లా, మండల విద్యాశాఖల నుంచి అనేక నివేదికలు కావాలనే ఆదేశాలతో బోధనేతర కార్యక్రమాలకే అధిక సమయం కేటాయించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

అదనపు భారం..

ప్రభుత్వ పాఠశాలల్లో బోధనేతర పనులతో ఒత్తిడి తీవ్రమై మానసిక వేదనకు గురవుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. ప్రభుత్వ బడులలో నమోదవుతున్న విద్యార్థుల వివరాలను యూడైస్‌ ప్లస్‌లో నమోదు చేయాలి. ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్లు బోధనేతర సిబ్బందిలో పని భారం తగ్గినప్పటికీ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అదనపు భారం పడుతోంది. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉంటారు. కానీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు సింహభాగం పాఠశాలలో ఉండడు. నివేదికల సమర్పణ పనులకే ఒక ఉపాధ్యాయుడు పూర్తి సమయం కేటాయించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో బోధన జరగక విద్యార్థులు నష్టపోతున్నారు.

గుదిబండగా మధ్యాహ్న భోజన పథకం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో అపశ్రుతులు ఇటీవల ఎక్కువవుతున్నాయి. ఫలితంగా నవీపేట, రెంజల్‌ బోర్గాం పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సస్పెండ్‌కు గురయ్యారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వండాలని అధికారుల నుంచి ఒత్తిడి ఎదురవుతోందని హెచ్‌ఎంలు పేర్కొంటున్నారు. వంట ఏజెన్సీలకు సకాలంలో బిల్లులు రాక ప్రధానోధ్యాయులు ఏమీ చేయలేకపోతున్నారు. రక్షిత మంచినీటి వసతి, వంటశాలలు, వంటపాత్రలు లేకపోవడంతో చాలా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు.

బోధనేతర పనుల నుంచి తప్పించండి



మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాల నుంచి ప్రధానోధ్యాయులను తప్పించాలి. వీటిని ప్రత్యేక ఏజెన్సీలకు అప్పగించాలి. ఉన్నతి కార్యక్రమాన్ని సరళీకృతం చేసి బోధనకు ఎక్కువ సమయం కేటాయించేలా హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వాలి. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలి.

– అంకం నరేశ్‌, ఉపాధ్యాయుడు

డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించాలి



పాఠశాలల్లో అల్పాహారం, రాగిజావ, మధ్యాహ్న భోజన పర్యవేక్షణ, ఆన్‌లైన్‌ డేటా ఎంట్రీ, అటెండెన్స్‌ వంటి బోధనేతర పనులతో బోధన సమయం తగ్గుతోంది. అదనపు క్లాసులు తీసుకొని సిలబస్‌ పూర్తి చేయాల్సి వస్తోంది. ఈ పనులు చేయడానికి డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను అవుట్‌ సోర్సింగ్‌ ద్వారా నియమించాలి.

–చౌదారపు రాంప్రసాద్‌, హెచ్‌ఎం, కోనాపూర్‌

లయన్స్‌ క్లబ్‌ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న లయన్స్‌ ఇంటర్నేషనల్‌ చైర్మన్‌ లయన్‌ బ్రియాన్‌ ఈ-సీహాన్‌



బ్రియాన్‌ ఈ సీహాన్‌ను సన్మానిస్తున్న బోధన్‌ లయన్స్‌ క్లబ్‌ ప్రతినిధులు

బోధన్‌: బోధన్‌ లయన్స్‌ క్లబ్‌, కంటి ఆస్పత్రి ద్వారా 21 ఏళ్లుగా సేవలు అందించడం అభినందనీయమని లయన్స్‌ ఇంటర్నేషనల్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌, లయన్స్‌ ఇంటర్నేషనల్‌ మాజీ అధ్యక్షుడు లయన్‌ బ్రియాన్‌ ఈ-సీహాన్‌ అన్నారు. తాను అమెరికా నుంచి వచ్చి ఇక్కడ లయన్స్‌ క్లబ్‌ ద్వారా పేదలకు అందిస్తున్న సేవలను చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ బోధన్‌ ఆధ్వర్యంలో ఎడపల్లి శివారులో రూ.3 కోట్ల నిర్మించిన వృద్ధాశ్రమం, బోధన్‌ లయన్స్‌ కంటి ఆస్పత్రిలో రూ.కోటితో నిర్మించిన ఆడిటోరియం, కంటి ఆపరేషన్‌ థియేటర్‌లను ఆయన గురువారం ప్రారంభించారు. బోధన్‌కు చెందిన లయన్స్‌ క్లబ్‌ జిల్లా 320 గవర్నర్‌ వేమూరి లక్ష్మి క్రియాశీలకంగా పని చేస్తూ దేశంలో రెండోస్థానంలో నిలిచారని కొనియాడారు. లయన్స్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆఫ్‌ బోధన్‌ వ్యవస్థాపకులు పోలవరపు బసవేశ్వర్‌రావు మాట్లాడుతూ రెండు దశాబ్దాలకు పైగా కంటి ఆస్పత్రిని నడిపిస్తూ, మరో మూడు కొత్త శాఖలను ప్రారంభించి పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ తూము పద్మశరత్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవలో లయన్స్‌ క్లబ్‌ ముందు వరుసలో ఉందన్నారు. ముఖ్య అతిథిని క్లబ్‌ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. లయన్స్‌ ఇంటర్నేషనల్‌ ఫౌండేషన్‌ కార్యదర్శి విజయకుమార్‌ రాజు, చైర్మన్‌ నర్సింహారెడ్డి, ప్రతాప్‌గుప్తా, శశిభూషణ్‌, పెంటయ్య, కొడాలి కిశోర్‌, అమర్‌నాథ్‌రావు, నాగరాజు, శ్రీనివాస్‌రావు, ఉమేష్‌ షిండే, విజయ్‌కుమార్‌, సూర్యనారాయణ, కొయ్యాడ శ్రీనివాస్‌ గౌడ్‌, శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌


ఇరువర్గాలపై కేసు నమోదు



మాట్లాడుతున్న ఎస్సై మురళి

దోమకొండ: మండల కేంద్రంలో బుధవారం రాత్రి ముగ్గురు మహిళల హల్‌చల్‌ కేసులో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మురళి తెలిపారు. పీఎస్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగేళ్ల క్రితం మాచారెడ్డి మండలం లచ్చాపేటకు చెందిన బూస సత్యనారాయణ–కవిత దంపతులకు దోమకొండకు చెందిన పందిరి కాశీనాథ్‌ అప్పు ఇచ్చాడు. రెండేళ్ల క్రితం కవిత భర్త సత్యనారాయణ చనిపోగా, కవిత ఇల్లు అమ్మి అప్పుచెల్లించింది. కానీ అప్పు చెల్లించలేదని కాశీనాథ్‌ చెక్‌బౌన్స్‌ కేసు పెట్టాడని, దీంతో కవిత కూడా కాశీనాథ్‌పై వేధింపుల కేసు పెట్టిందన్నారు. ఇరువురు కేసు రాజీచేసుకోవాలని నిర్ణయించగా, ముందుగా కవిత తన కేసును విరమించుకోగా కాశీనాథ్‌ మాత్రం కేసు విరమించుకోలేదు. దీంతో కవిత బుధవారం రాత్రి తన స్నేహితులైన సరిత, సానియాబేగంతో కలిసి కాశీనాథ్‌ ఇంటికి వచ్చారు. ఇరువురి మధ్య గొడవ జరుగగా దొంగతనానికి వచ్చారనే భయంతో కాలనీవాసులు ముగ్గురు మహిళలపై దాడిచేసి పోలీసులకు అప్పగించారు. విచారణలో అసలు విషయాలు బయటకు వచ్చినట్లు తెలిపారు. తనపై దాడిచేశారంటు కాశీనాథ్‌ అతని భార్యపై కవిత ఫిర్యాదు చేయగా, తన ఇంట్లో దొంగతానికి యత్నించారని కాశీనాథ్‌ ఫిర్యాదు ముగ్గురు మహిళలు కవిత, సరిత, సానియాబేగంపై ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పాతంగల్‌ విండో మాజీ చైర్మన్‌ మృతి



నరేందర్‌రెడ్డి (ఫైల్‌)

రుద్రూర్‌: పాతంగల్‌ విండో మాజీ చైర్మన్‌ నరేందర్‌ రెడ్డి అనారోగ్యంతో గురువారం హైదరాబాద్‌లో మృతి చెందాడు. రెండు సార్లు పాతంగల్‌ విశాల సహకార సంఘం అధ్యక్షుడిగా, మూడు సార్లు కల్లూర్‌ సర్పంచ్‌గా, బోధన్‌ పంచాయతీ సమితి అధ్యక్షుడిగా పని చేశారు. పలువురు నాయకులు సంతాపం తెలిపారు. స్వగ్రామంలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

విద్యార్థుల ఆటోను ఢీకొన్న కారు

- ముగ్గురికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో విద్యార్థినికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్‌ ప్రతిమారాజ్‌

జక్రాన్‌పల్లి/ఖలీల్‌వాడి: పాఠశాల విద్యార్థులతో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ఘటన గురువారం మండలంలోని సికింద్రాపూర్‌ పరిధిలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాలు.. జక్రాన్‌పల్లి మండలం బాలానగర్‌కు చెందిన 14 మంది విద్యార్థినులు సికింద్రాపూర్‌లోని ఉన్నత పాఠశాలకు వెళ్లడానికి ఆటో ఎక్కారు. ఆటో కొద్ది దూరం వెళ్లగానే హెచ్‌పీ పెట్రోల్‌ బంక్‌ సమీపంలో 44వ నంబర్‌ జాతీయ రహదారిపై వెనుక నుంచి కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, 11 మంది స్వల్ప గాయాలతో బయట పడ్డారు. గాయాలైన విద్యార్థినులకు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వారిని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ ప్రతిమారాజ్‌ పరిశీలించారు. స్వల్పంగా గాయపడిన వారిని వైద్యులు డిశ్చార్జ్‌ చేశారు. తీవ్రంగా గాయపడ్డ అంకిత, నిఖిత, అటుకావర్‌ అంకితలు వైద్యులు అబ్జర్వేషన్‌లో ఉన్నారు. ఆటోను ఢీకొట్టిన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దుబ్బాక వీడీసీ సభ్యులపై కేసు

ఖలీల్‌వాడి: ధర్పల్లి మండలంలోని దుబ్బాక వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు డీసీపీ జయరామ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో పద్మశాలి కులానికి చెందిన భూమిని వీడీసీ వారు ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. ఈ భూ వివాదంలో వీడీసీ సభ్యులు 40 మంది పద్మశాలి కుటుంబాలను బహిష్కరించి వారికి రూ.50 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో విచారణ జరిపి వీడీసీ సభ్యులైన కొత్తి రాజశేఖర్‌ అలియాస్‌ శేఖర్‌ రెడ్డి, పెండ అరుణ్‌ అలియాస్‌ అర్జున్‌, దొంకెన చిన్న గంగారాం, భుర్కి నర్సాగౌడ్‌ అలియాస్‌ చేగంటి నర్సాగౌడ్‌, భూమేడ మురళిపై కేసు నమోదు చేశామన్నారు. వీరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కౌలు డబ్బులు దేవాదాయ శాఖకే చెల్లించాలి

నిజామాబాద్‌ సిటీ: నగరంలోని బడా రాం మందిర్‌ (బ్రహ్మపురి పెద్ద రాంమందిరం)కు చెందిన భూముల కౌలుదారులు తమ కిస్తీ డబ్బులను నిజామాబాద్‌ దేవాదాయ, ధర్మాదాయ శాఖకే చెల్లించాలని ఉమ్మడి జిల్లాల దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్‌ సుప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్‌ 25న బడా రాం మఠంను దేవాదాయ శాఖ పరిపాలన కింద తీసుకున్నట్లు పేర్కొన్నారు. మఠం పరిధిలోగల వ్యవసాయ భూములను కౌలు పద్ధతిలో సాగు చేస్తున్న వారు ఇక నుంచి కౌలు డబ్బులను మఠం ఫిట్‌పర్సన్‌ జి వేణుకు చెల్లించాలని సూచించారు. ఏ ఇతర ప్రైవేట్‌ వ్యక్తులతో మఠానికి సంబంధం లేదని తెలిపారు. కౌలు చెల్లించకుంటే ఆయా సర్వే నంబరులో గల భూములను బహిరంగ వేలం ద్వారా కౌలుకు ఇస్తామని పేర్కొన్నారు.

అమీనాపూర్‌ వీడీసీపై కేసు నమోదు

వేల్పూర్‌: మండలంలోని అమీనాపూర్‌లో ఉన్న 35 ఎస్సీ మాల కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేసిన 9 మంది వీడీసీ సభ్యులపై ఆర్మూర్‌ ఏసీపీ జగదీశ్‌చందర్‌ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వినయ్‌కుమార్‌ గురువారం పేర్కొన్నారు. వీడీసీ సభ్యులు 24 మందిపై కేసు నమోదు చేయగా 9 మంది అరెస్టు కాగా మిగతా వారు పరారీలో ఉన్నట్లు తెలిపారు. చట్టవ్యతిరేక పనులు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.